بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 16.11.2018 (Telugu)**

## ఇస్లాం స్వచ్ఛమైన సందేశమును అమెరికాతో పాటు ప్రపంచములో కూడ తీవ్రంగా శ్రమించి సరైన పద్ధతిలో వ్యాపింపజేయుట మన కర్తవ్యము

## ఫెలాడెల్ఫియా, బాల్టిమూర్, వర్జీన్యాలో మూడు మస్జిదుల, గోయిటెమాలాలో హ్యూమేనిటి ఫస్ట్ ఆసుపత్రి ప్రారంభోత్సవము, ఆయా వేడుకలలో పాల్గొన్న అతిథుల విశ్వాస భరిత అభిప్రాయములు

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 16.11.2018 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మోర్డన్ (ఇంగ్లాండ్)లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. గత జుమాలో తహ్రీకె జదీద్ నూతన సంవత్సర ప్రకటన వలన అమెరికా, గోయిటెమాలా పర్యటన గురించి ప్రస్తావించలేదు. అల్లాహ్ తఆలా కృపానుసారము ఈ పర్యటనల వలన ఎన్నో సానుకూల ప్రభావములు వెలువడుతాయి. సొంతవారితో పాటు ఇతరులతో సంబంధము పట్ల, జమాఅత్ వ్యవస్థపరంగా నేరుగా అనేక విషయములను ప్రత్యక్షంగా చూచినందున అనేక విషయముల గురించి నాకు అవగాహన కలుగుతుంది. మూడూ పెద్ద లాభములు ఇట్లు గలవు. (1) భేటీలు, మస్జిదుల ప్రారంభోవత్సము లేదా వేడుకలు మొదలగు వాటి ద్వారా ఈ దేశములలో విద్యావంతుల శ్రేణి, పలుకుబడి గల ప్రజలతో సత్సంబంధములు ఏర్పడును. (2) రెండవ విషయము మీడియా ద్వారా ఇస్లాం, అహ్మదియ్యత్ పరిచయం, నిజమైన బోధన ప్రజలకు అందును. (3) మూడవ పెద్ద విషయమేమనగా జమాఅత్ సభ్యులతో వ్యక్తిగత సంబంధము, పరిచయం ఏర్పడును. తద్వారా వారి విశ్వాసము, వినమ్రత పెరిగిపోవును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ పర్యటనలో భాగంగా అమెరికాలో మూడు మస్జిదులను ప్రారంభించు అనుగ్రహము లభించెను. నేను ఎక్కడికి వెళ్ళినా అక్కడి యువకులు, స్త్రీ, పురుషులు తమ అధిక సమయమును మస్జిద్ పరిసరాలలో గడిపినారు. ఖిలాఫత్‌తో వారికి గల అనుబంధము బహిర్గతమయ్యేది. అందుకే వారు మస్జిద్‌నకు వచ్చి అధిక సమయము మస్జిద్‌లోనే గడిపేవారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అమెరికా రాజకీయ నాయకులు కూడ, విద్యావంతల శ్రేణి కూడ, సామాన్య ప్రజలు కూడ అధికశాతం మంచి విషయమును విని ప్రోత్సహింతురు. ఇస్లాం స్వచ్ఛమైన బోధన వారికి చేరలేదు. పొందిన వారు, జమాఅత్‌తో సంబంధము గల వారు ఇస్లాం గురించి సదాభిప్రాయం కలిగివున్నారు. ఇస్లాం స్వచ్ఛమైన సందేశమును అమెరికాతో పాటు ప్రపంచములో కూడ తీవ్రంగా శ్రమించి సరైన పద్ధతిలో వ్యాపింపజేయుట మన కర్తవ్యము. మన సందేశముతో ముస్లిమేతరులకు ఇస్లాం బోధన తెలిసినట్లే అహ్మదీయులు కాని ముస్లిములకు కూడ నిజమైన ఇస్లాం తెలిసిపోవును. అహ్మదీయులు కాని ముస్లిములు మనతో ఇస్లాం అందమైన బోధనను విన్నప్పుడు మనము ఎలాంటి సంకోచానికి గురి కాకూడదని వారికి కూడ ఆత్మస్థైర్యం లభిస్తుంది. ఇది చాలా చోట్ల అనుభవమైనది. అమెరికాలో కూడ అయినది. వాస్తవానికి ప్రపంచ సమస్యల పరిష్కారము ఇస్లాం ద్వారనే లభించును. ఇస్లాం అందమైన బోధనను మీరు ఎంతో గొప్ప రీతిలో వెల్లడిస్తారని అహ్మదీయులు కాని ముస్లిములు కూడ అభిప్రాయపడ్డారు.

అతిథులైన పలువురి విశ్వాసభరిత అభిప్రాయములను హుజూరె అన్వర్ ప్రస్తావించిరి. ఫెలాడెల్ఫియాలో మస్జిద్ బైతుల్ ఆఫియత్ ప్రారంభోత్సవ సందర్భమున ఆనరేబుల్ డ్వాయిట్ ఎవన్స్ మెంబర్ యు.ఎస్.కాంగ్రెస్ వచ్చియుండిరి. వారు ఎన్నో మంచి మాటలలో నాతో ఇట్లనిరి. ఈ పెద్ద నగరములో నేను మీకు స్వాగతం పలుకుచున్నాను. సోదరులు, సోదరీమణుల వంటి ఆప్యాయత గల నగరమిది. ఫెలాడెల్ఫియా పాలక వర్గము తరపున నేను ముస్లిం కమ్యునిటికి చెప్పదలచినదేమనగా మీ శాంతియుత సందేశమునకు స్వాగతం పలుకుచున్నాను. మేము మీకు తోడుగా వున్నాము. ద్వేషము, అసూయ, తీవ్రవాదమునకు వ్యతిరేకంగా మేము నిలబడినాము.

శాంతిని స్థాపించుకొనుటకు మీరు ఎంతో గొప్ప సందేశమందించిరి. ఇటువంటి తరుణంలో ఈ సందేశము ఎంతో అద్భుతమైనది. ముస్లిం కమ్యూనిటి అమెరికాలో మాత్రమే కాక మొత్తం ప్రపంచానికే ఎంతో ముఖ్యమైనది.

అనంతరం మేయర్ జాన్ కేని గారిట్లనిరి. మత స్వేచ్ఛ అనేది ఈ నగర ప్రాథమిక సూత్రములలో గలదని ఫిలాడెల్ఫియా నగర చరిత్ర ద్వారా తెలియును. ఈ నగరము దీని ఆధారముగనే నిర్మించబడెను. మనము నిస్సందేహంగా విభిన్న జాతులు, వంశములకు చెందినను ఈ నగరము ప్రతి ఒక్కరికి స్వాగతం పలుకును. మనము కలిసి మెలిసి పని చేయవలెను, పరస్పరం ఒకరు మరొకరిని గౌరవించుకోవలెను. మనము కలిసి వుండగలమని, మన సమస్యలను తుదిముట్టించగలమని ప్రపంచానికి చాటి చెప్పుదాం.

ఒక స్థానిక కౌన్సిలర్ ఇట్లనిరి. ప్రస్థుత తరుణంలో మీ శాంతి సందేశము ఎంతో అవసరముండెను. కనుక ఈ సందేశము చాలా ప్రాముఖ్యతను సంతరించుకొనెను. ఇరుగు పొరుగు వారికి చేదోడు వాదోడుగా వుంటామని మీరిచ్చిన సందేశము ఇక్కడ ఫిలాడెల్ఫియాలోనే కాక అమెరికా మొత్తంలో అవసరమున్నది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అనంతరం బైతుస్సమద్ పేరున గల బాల్టీమూర్ మస్జిద్ ప్రారంభోత్సము కూడ జరిగెను. ప్రారంభ వేడుకలో పాల్గొన్న బాల్టీమూర్ మేయర్ ఇట్లనిరి. మీరు శాంతి గురించి మాట్లాడినారు. నేడు ఈ సందేశము ఎంతో అవసరమైనది. కేవలం మా నగరములోనే కాక మొత్తం రాష్ట్రములో, మొత్తం యు.ఎస్.ఏలో, అనంతరం ప్రపంచమంతటా దీని అవసరము ఎంతో వున్నది. ఈ సందేశమును ప్రతి ఒక్కరు వినవలెను. మనము విన్నచో ప్రపంచ సమస్యలకు ఏకైక పరిష్కారం శాంతి అని, మనము పరస్పరం ఒకరినొకరం ప్రేమపూర్వకంగా చూసుకోవాలని మనకు స్పష్టమగును.

ఒక విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఇట్లనిరి. ఇదొక మహా అద్భుతమైన సందేశము. దీని ద్వారా మనము సమాజములో ఒక ముఖ్యమైన మార్పు సృష్టించగలము. యు.ఎస్.ఏ.సమాజానికి ఈ సందేశము చాలా విలువైనది. ఈ మహా గొప్ప సందేశము నన్ను ఎంతగానో ప్రభావితం చేసెను.

48 జిల్లాలకు రాష్ట్ర ప్రతినిధి అయిన ఒకరు ఇట్లనిరి. మీరు మా బాధ్యతల గురించి సూచించినందుకు ఈ సందేశమును విని నేను చాలా ప్రభావితమైనాను. అందరిని ప్రేమించు ఎవ్వరిని ద్వేషించకు అని మీరు మాకు చెప్పినారు. ఈ విషయములే మాకు అవసరమున్నవి. అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ ఇక్కడ పర్యటించినందున కలిగిన ప్రభావములో మేము సమాజ ఔన్నత్యము కొరకు ఎంత కృషి చేసినా సాధ్యమయ్యేది కాదు.

41 జిల్లాలకు రాష్ట్ర ముస్లిం ప్రతినిధి బిలాల్ అలీ గారిట్లనిరి. మీరిచ్చిన సందేశము ఇక్కడి ప్రజలందరిలో ప్రతిధ్వనిస్తుంది. పరస్పర ఐక్యత, ఏకాభిప్రాయము, ప్రేమానురాగము, ఆప్యాయత గల వాతావరణము ఏర్పాటు చేయుటకు ఈ సందేశము ఎంతో ముఖ్యమైనది. మీరు సరియైన సమయములో సమస్యల పరిష్కారము మాకు చూపినారు. బాల్టీమోర్ సమస్యలను అధిగమించేందుకు అహ్మదియ్య ముస్లిం జమాఅత్ సిద్ధమైనది. సమాజములో ఒక సానుకూల పాత్రను పోషించుటకు తమ సంకల్పమును ప్రకటించిన తరుణంలో ఇదొక ఆచరించదగ్గ ఆదర్శం.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. వర్జిన్యాలో మస్జిద్ ప్రారంభోత్సము జరిగెను. ఆ మస్జిద్ పేరు మస్రూర్ అని పెట్టబడెను. యు.ఎస్.ఏ.రిపబ్లికన్ అభ్యర్థి అయిన కోరి స్టోర్ట్ అనే మిత్రులు ఇట్లనిరి. నేను విన్న ఉపన్యాసము ఎంతో ఆకర్షణీయమైన, వివేకవంతమైనది. ప్రేమించు అందరిని ద్వేషించకు ఎవ్వరిని అనే సందేశమును అమెరికాతో సహా ప్రపంచమంతా అతి శ్రద్ధతో వినవలెను, దానిని ఆచిరంచవలెను. ప్రపంచ పరిస్థితులు ఆమగ్యగోచరంగా వున్న తరుణంలో మత స్వేచ్ఛ ప్రచారము చేయవలసిన అవసరమున్నది. మీరు దేశము ప్రయోజనమునకు ఎంతో సేవ చేయుచున్నందుకు ఈ మస్జిద్ మాకు గర్వ కారణం.

ఒక అతిథి ఎలెక్స్ కేసే ఇట్లనిరి. నేను చాలా ప్రభావితమైనాను. ఎందుకనగా మీ సందేశము ఎంతో ఆకర్షణీయంగా వుండెను. ఒక్కక్క అక్షరము నా ఆత్మను సైతం ప్రభావితం చేయుచుండెను.

న్యూజెర్సీలో సర్జికల్ కో ఆర్డినేటర్ అయిన మరొక మహిళ షనీన్ గారిట్లనిరి. దుష్టులైన కొందరి చర్యల వలన ఆ మతమును మొత్తానికే నిందించుట ఒక దౌర్జన్యమనబడునని ఇస్లాం అందమైన బోధనల గురించి నేను కూడ అభిప్రాయపడుచున్నాను.

లోరీన్ గారైన ఒక మహిళ తమ అభిప్రాయములను వెల్లడించుచు ఇట్లనిరి. నన్ను ఇక్కడికి ఆహ్వానించినందుకు నాకు చాలా సంతోషము కలుగుచున్నది. ఇక్కడికి వచ్చినందుకు అహ్మదియ్య ముస్లిం జమాఅత్ గురించి నాకు ఎంతో తెలిసినది. ఈ ప్రాంతములో మస్జిద్ నిజంగానే ఒక ఆహ్వానించదగ్గ అంశము. ఇది శాంతియుత స్థలమైనందుకు దీనితో నాకెలాంటి ప్రమాదము లేదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ మస్జిదుల ప్రారంభోవత్సముతో పాటు గోయిటెమాలాలో హ్యుమేనిటి ఫస్ట్ ద్వారా నిర్మంచబడిన ఒక ఆసుపత్రి ప్రారంభించబడెనని చాలా మందికి తెలుసు. ఒక మెంబర్ ఆఫ్ పార్లమెంట్ చాలా మంచి అభిప్రాయములు వెల్లడించి, జమాఅత్ మా దేశములో ఆసుపత్రి నిర్మించి, కమ్యునిటీలలో ప్రేమానురాగము, ఐక్యత కలిగించుటకు కృషి చేయుచున్నందున జమాఅత్‌నకు కృతజ్ఞతలు తెలిపిరి.

వైస్ మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ పీరాగోయె అయిన రాబర్ట్ కీను గారిట్లనిరి. ఇదెంతో గొప్ప వేడుక. ఒక జమాఅత్ సభ్యులు కలిసి దీనిని పూర్తి చేసినందుకు నేను ఆశ్చర్యానికి లోనైనాను. నిరుపేదల, మానవుల పట్ల ప్రేమ గలదనుటకు ఇదొక ఆచరణాత్మక ప్రకటన. ఇదే మానవత్వ దారి. ప్రేమ మార్గమును ఆచరించినచో ప్రపంచములో శాంతి ఏర్పడును.

గోయిటెమాలాలోని ఒక పత్రికాకారుడు ఇట్లనిరి. మతములో నిర్బంధము లేదు, పరస్పరం ఒకరు మరొకరికి సహకరించుకోవలననే విషయము అన్నిటికంటే ప్రభావితం చేసెను. ఈ సందేశమే ఇమామ్ జమాఅత్ మాకు అందించారు. మనమందరము సమాన హక్కులు కలిగివున్నాము, ప్రతి మానవుడు ప్రామాణిక జీవితము గడపాలని కూడ సందేశమందించారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. రివ్యూ ఆఫ్ రిలీజియన్స్ స్పెనిష్ సంచిక కూడ గోయిటె మాలాలో ప్రారంభించబడెను. స్పెయిన్ పట్ల మనకు దృష్టి ఏర్పడినపుడు గోయిటెమాలాలో గల మన ఒక విధేయులైన అహ్మదీ డేవిడ్ గారిట్లనిరి. ఇస్లాం స్పెయిన్‌లో వ్యాపించాలని మీరు దృష్టి సారించుచున్నారు. కాని దాని జనాభా కేవలం 40 మిలియన్లు మాత్రమే. మా దేశముల సంఖ్య 400 మిలియన్లు అయినను ఇటువైపు మీరు శ్రద్ధ చూపడం లేదు. అనంతరం అక్కడ కూడ క్రమంగా ప్రచార కేంద్రాల కొరకు దృష్టి కలిగెను. జామిఅ విద్యార్థులను పంపడం కూడ మొదలు పెట్టినాము. అల్లాహ్ తఆలా కృపానుసారము ఇప్పుడు అక్కడ జమాఅత్‌లు ఏర్పాటగుచున్నవి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇరుగు పొరుగు దేశాల అహ్మదీయులు కూడ గోయిటెమాలలో పాల్గొనిరి. వర్తమాన ఖలీఫాను మొదటి సారి కలసిన వారి మనోభావాలతో కూడిన అభిప్రాయములు వెల్లడించిరి. ఖిలాఫత్ పట్ల అభిమానము వారి కనులు, హృదయముల నుండి స్పష్టముగా వెలువడుచుండెను.

క్రొత్తగా చేరిన ఒక మహిళ లాయిరహ్ మాల్డె గారిట్లనిరి. నేను ఆధ్యాత్మికంగా, భావాలపరంగా ఎంతో మనశ్శాంతి, సుఖము అనుభవించుచున్నాను. ఇతర దేశాల అహ్మదీ సోదరులు, సోదరీమణులను కలిసినందుకు విశ్వాసము తాజాదనము పొందెను. అన్నిటి కంటే పెద్ద విషయమేమనగా వర్తమాన ఖలీఫా వెనుక నమాజులు చదివినందుకు అల్లాహ్ తఆలా, అహ్మదియ్యత్ గురించి నా విశ్వాసము ఎంతో పెరిగినది. ఈ మార్గములో స్థిరంగా వుండాలని నేను ఆశించుచున్నాను. అల్లాహ్ తఆలా ఇందుకు అనుగ్రహించుగాక!

క్రొత్తగా బైఅత్ చేసిన మరొకరు ఫ్రాన్సిస్కో గారిట్లనిరి. బైఅత్ వేడుకలోని ఒక్కొక్క క్షణమును పదాలలో వర్ణించలేము. ఆ క్షణాన శారీరకంగా నాకు కలిగిన అనుభూతి ఏమనగా నా శరీరమంతా వేడెక్కిపోయినది, నాకు చెమటలు పట్టినవి, నా శరీరములో ఒక విద్యుత్తు ప్రవహించుచున్నది, అది పోతూ పోతూ నా పాపములన్నిటిని తీసుకెల్లినది. మాకు ఖిలాఫత్ ప్రసాదించినందుకు అల్లాహ్ తఆలాకు లక్షలాది కృతజ్ఞతలు. మంచి వైపు ప్రయానించుటకు ఇది మొదటి అడుగు, ఇది నాలో ఒక మార్పు సృష్టించునని నాకు తెలుసు.

ఎక్వడోర్ నూతన అహ్మది ఇట్లనిరి. వర్తమాన ఖలీఫా రావడం వలన నాకొక అరుదైన నిధి లభించినది. ఆధ్యాత్మికత, శాంతి, ఆనందము, సంతోషకరమైన భావాలు నన్ను సంతరించుకున్నవి. నాకు చాలా తృప్తి కలిగినది. బైఅత్ సందర్భమున వారు తమ పవిత్ర హస్తమును నా చెయ్యిపై పెట్టుట నాకెన్నడు లభించని సత్కారమిది.

అనంతరం గోయిటెమాలాలోని ఒక నూతన అహ్మది సులెమాన్ రోదో గారిట్లనిరి. వర్తమాన ఖలీఫా

గోయిటె మాలా రావడం మా కొరకు ఒక గొప్ప అదృష్టము. వారిక్కడికి రావడం మా జమాఅత్‌పై అల్లాహ్ తఆలా శుభమే. వారు గోయిటెమాలా వస్తున్నారని మాకు తెలిసినప్పుడు మా సంతోషానికి అవదుల్లేకుండా పోయెను. నాలో ఒక రకమైన ఆధ్యాత్మిక దృఢత్వము ఏర్పడడం మొదలయ్యెను. ఇప్పుడు నేను నాలో చాలా మార్పు చూస్తున్నానడంలో ఎలాంటి అనుమానం లేదు.

గోయిటెమాలాకు చెందిన మరొకరు డోమిని అవ్వల్ చాలా ఉద్వేగభరితంగా నాతో ఇట్లనిరి. మా ప్రాంతములో చాలా పేదలున్నారు. చాలా దూరమైన ప్రాంతము. రహదారులు కూడ సరిగ్గా లేవు. నా జాతి ప్రజలు కూడ అహ్మది ముస్లిములగుటకు దుఆ చేయగలరు. నాకందిన అల్లాహ్ తఆలా శుభములు నా జాతి ప్రజలకు కూడ అందుగాక! దుఆ కొరకు వారెంతో గద్గధ స్వరముతో ఈ మనవి చేశారు. అక్కడ కూడ జమాఅతులు ఏర్పాటగుగాక!

మెక్సికో నూతన అహ్మది అయిన ఫుయూజ్ ఖుసూస్ గారిట్లనిరి. జమాఅత్‌తో సంబంధము ఏర్పడుట ఒక పెద్ద వరము. అల్లాహ్ తఆలా నా దుఆలను ఆమోదించుట నా అదృష్టము. నేను అంధకారములో వుండగా అల్లాహ్ తఆలా నన్ను, నా కుటుంబాన్ని జ్యోతి వైపు తీసుకొచ్చెను. నా జీవితములో మార్పు కలుగుటకు నాకు అవకాశము లభించెను.

13,14 సం॥ల ఒక బాలిక ఇట్లనెను. పశ్చత్తాపానికి గురయ్యే విషయము ఏదియును వర్తమాన ఖలీఫా ఎదుట మాట్లాడకూడదని ముందు నాకు భయముండెను. అయినను భేటి చాలా మంచిగా జరిగెను. వారిలో ఖిలాఫత్ పట్ల గౌరవము, మర్యాద చాలా వున్నది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇదే విధంగా ఇంకా విభిన్న దేశముల నుండి వచ్చిన చాలా మంది స్త్రీ, పురుషులున్నారు. వారందరు ఎంతో విధేయత, విశ్వసనీయతను చూపిరి. అల్లాహ్ తఆలా అందరి విధేయత, విశ్వసనీయతను పెంచుగాక!, వారిని నిజమైన అహ్మదీయులుగా చేయుగాక!

మీడియా కవరేజి గురించి వివరములు తెలుపుచు హుజూరె అన్వర్ ఇట్లనిరి. అమెరికాలో టి.వి. ద్వారా మొత్తం 28 లక్షల 69 వేల కంటే అధిక జనాభాకు సందేశమందెను. రేడియో కార్యక్రమాల ద్వారా మొత్తం 53 లక్షల 98 వేల కంటే ఎక్కువ మందికి సందేశమందెను. డిజిటల్ ఫోరమ్ వెబ్ సైట్లు, సోషల్ మీడియా ద్వారా మొత్తం 20 లక్షల మంది వరకు సందేశమందెను. పత్రికలలో 45 వ్యాసములు ముద్రించబడెను. తద్వారా 10 మిలియన్ల కంటే అధిక ప్రజలకు సందేశమందెను.

ఒక అంచనా ప్రకారము లాటీనీ అమెరికాలోని వివిధ దేశముల ప్రింట్ మీడియా, వివిధ పత్రికలు, టెలివిజన్ ఛానళ్ళ ద్వారా సుమారు 32 మిలియన్ల ప్రజలకు నాసిర్ అసుపత్రి ప్రారంభోవత్స వార్తల ద్వారా ఇస్లాం సందేశమందెను. అల్లాహ్ తఆలా కృపానుసారము ఈ పర్యటన అన్ని విధాలా శుభదాయకము, సఫలముగా కొనసాగెను. భవిష్యత్తులో కూడ దీని సత్ఫలితములను అల్లాహ్ తఆలా వెల్లడించుగాక!

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గా॥ తావాదుగో ఇస్మాయిల్ గారి సద్గుణములను ప్రస్తావించి జుమా నమాజ్ తర్వాత వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివించిరి.

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.......................................................................

.......................................................................

.......................................................................